# జ్ఞానోదయం

సమయం పది గంటలయింది ఆలవాటు ప్రకారం కిటికీ దగ్గిర కుర్చీలో చతికిలబడింది రాధిక. అబ్బ! ఈ రోజు ఎంత మబ్బువేసిందో అనుకుంటూ తన చూపు అందినంత మేరకు ఒకసారి పరిశీలించింది, రోడ్డు చివరిదాకా రాధిక 'ప్చ్' యింకా రాలేదు! అనుకుని అక్కడే టేబుల్‌మీద వున్న పుస్తకం తీసి చదవటం మొదలు పెట్టింది ఇంతలో 'టప్' మని శబ్దమైంది ఏమిటి చెప్మా! అనుకుంటూ తలుపు దగ్గర చూచింది గులాబీ రంగు కవరు చూడ్డానికి చాలా ముచ్చటగా వుంది అప్రయత్నంగా తెరిచి చూచింది. చదివింది.

* * *

నేను చేసిన తప్పు ఏమిటి? అని ఆలోచనలో పడింది. ఈ పొరబాటు ఎలా జరిగింది? నేను కిటికీ వద్ద కూర్చోవటం నేరమా! కూర మాడిన వాసన ముక్కుపుటాల్ని ఎగురవేస్తోంది అయ్యో! కూర మాడిపోయింది అనుకుంటూ వంటింట్లోనికి పరుగెత్తింది రాధిక,

* * *

ఆ మరునాడు ఆదివారం యధా ప్రకారం కిటికీ వద్ద కుర్చీలో కూర్చుంది రాధిక రోడ్డుకి అవతల ఎదురింటి కేసి చూచింది పెద్ద తాళంకప్ప వ్రేలాడు తోంది

"రాధికా ఏమిటి అంత పరధ్యానంగా వున్నావు?" అన్న గోపాల్ మాటతో తృళ్ళిపడింది

"అబ్బే! ఏమీ లేదండీ! మీతో ఒక విషయం చెప్పాలండి." అంటూ కుర్చీ దగ్గిరకు జరిపింది రాధిక. ఆ తర్వాత "ఇదిగో ముందు ఇది చదివి చూడండి." అని, లేతాకుపచ్చ కాగితాన్ని గోపాల్‌కు అందిచ్చింది గోపాల్ చదవనారంభించాడు

డియర్ రాధిక,

పేరులో పొరబాటు లేదు కదూ! ఈ సంబోధనకు చికాకు పడక దయవుంచి నా వుత్తరాన్ని పూర్తిగా చదవవలసిందిగా కోరుతున్నాను

నీ పేరు ఎంత మధురంగా ఉందో నీవు అంత అందంగా ఉన్నావు. ఎప్పుడుచూసినా కడిగిన మంచిముత్యంలా గుంటావు నీ అందాన్ని వర్ణించటానిక్కి భాష చాలదు. కాని నా బాధంతా ఐ కాంట్ ఇమాజిన్ రాధికా! అబ్బ! తల్చుకుంటే వికారం పుడుతుందనుకో "కాకి ముక్కుకి దొండపండులా" నువ్వు ఏమి పాపం

**జయంతి కాళీ అన్నపూర్ణ**

నేసావని! ఈ విధంగా శిక్షించటాన్కి. మీ ఇద్దర్నీ చూస్తే నాకేమనిపిస్తుందో తెలుసా! "కాకి ముక్కుకి దొండపండు దండగ, దండుగ అది రామచిలుకకు దొరికితేనే పండుగ పండుగ!!" నీవు ఎస్ అంటే అజన్మాంతం నిన్ను ఆరాధిస్తూ, తోడుగా వుండిపోతాను మనిద్దరికి వయస్సులో అట్టే తేడా లేదు! నిన్ను రెండు నెలలుగా పరిశీలించి చూస్తున్నాను. మనిద్దరం తిరుపతి వెళ్ళి దేముని సన్నిధిలో వివాహం చేసుకుందాము. ఇది క్షణిక ఆవేశం కాదు నేను ఎంతో ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చేను నా అభిప్రాయం వెంటనే తెలియజేయి నీ జవాబుకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తూంటాను

ఇట్లు

నీవాడు కావాలనే ఆకాంక్షతో

'మధు'

అది చదివి నిట్టూర్పు విడిచేడు గోపాల్ దానికి జవాబు ఇది చదవండి అని, ఒక లెటర్ కాపీ అందిచ్చింది రాధిక

డియర్ మధు,

రాధిక వ్రాయునది నీ అభిప్రాయం తెల్సింది నా జవాబు కూడా విను గుండె దిటవు చేసుకొని, కొంచెం ఓపిగ్గా, పూర్తిగా చదువు

మేము ఈ మధ్యనే రెండు నెలల క్రితమే ఇక్కడకు ట్రాన్స్ఫరు మీద వచ్చాం నాకు ఇంతవరకూ ఎవరితో పరిచయం కాలేదు నాకు వేరే కాలక్షేపంలేక మావారు ఆఫీసుకు వెళ్ళిన తర్వాత ఆ కిటికీ దగ్గర కుర్చీలో కూర్చోవటం అలవాటయింది దీనికి ఇంకొక కారణం కూడా వుంది రోజూ పోష్టుకోసం ఎదురుచూస్తూ వుంటాను. మా వాళ్ళ వద్దనుండి మా ఫ్రెండ్స్ నుండి ఉత్తరాలేమయినా వస్తాయేమోఅని! ఒకటి, రెండుసార్లు నిన్ను చూడటం తటస్థించింది అలా చూపులు కలవట కాకతాళీయం అనుకున్నాను. నీలాంటి తమ్ముడు నాకు ఒకడున్నాడు. వయస్సు తేడా అట్టే అక్కర్లేదయ్యా! ఒక సంవత్సరం చాలు అక్కయ్య నవ్వటాన్కి.

నేను రోజూ కిటికీ దగ్గర కూర్చోవటంతో నీవు మరొక విధంగా భావించావు! ఇక పోతే "కాకి ముక్కుకి దొండపండు దండుగ, దండుగ అది రామచిలుకకు దొరికితేనే పండుగ, పండుగ" అని వ్రాశావు.

రంగులో ఏముందయ్యా! మన రాముడు, కృష్ణుడు సాంబయ్య నీరంగయ్యా! మనస్సు తెల్లగా వుండాలయ్యా! మా ప్రేమ వివాహమయ్యా తమ్ముడూ! మా సంసారంలో తీపి నీకేమి తెలుసయ్యా? మా తీపిగుర్తులు ఇద్దరు పిల్లలు తెలుసా తమ్ముడూ! మాది ఎన్నెన్ని జన్మలబంధమో నీకు తెలుసా! నీకు తెలియటం కష్టంలే! అది

తెలియాలంటే నీవు కూడా ఇంకా కొన్ని జన్మలెత్తాలేమో!! నీకు కూడా ఆ మధురానుభూతులు కావాలంటే చెప్పవయ్యా! నాకు ఒక ఆడబడుచుంది అచ్చం మావారిలానే ఉంటుంది మనసు కూడా తెలుపే! కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తామయ్యా, కంగారు పడకు!!

ఇట్లు
'నీ శ్రేయోభిలాషి'
రాధిక.

అది చదివిన గోపాల్ కళ్ళలో ఆనందబాష్పాలు తొంగిచూశాయి

"దీనికి జవాబు అదిగో అటు చూడండి" అని ఎదురింటికేసి చూపించింది రాధిక

రాధిక చూపిన దిక్కుకేసి చూచాడు గోపాల్ పెద్ద తాళంకప్ప వ్రేలాడుతోంది దానిపై ఒక స్లిప్ గుచ్చివుంది. వెంటనే ఆ ఇంటికివెళ్ళి స్లిప్ తీసుకు వచ్చాడు గోపాల్

"క్షమించు అక్కయ్యా! జ్ఞానోదయమయింది" అని వ్రాసివున్న స్లిప్‌ని చూచి, రాధిక - గోపాల్ తియ్యగా నవ్వుకున్నారు!!

